క్లుప్తంగా

రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలి



మహబూబాబాద్ అర్బన్: రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని రెడ్ క్రాస్ సొసైటీ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ నెహ్రూనాయక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని రామాస్ ఉర్దూ పాఠశాలలో ఆదివారం మహమ్మద్ ప్రవక్త జయంతి సందర్భంగా మైనార్టీ యువకులు రక్తదాన శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో అక్రమ్, జమీర్, జహీర్, ఇన్నా, జియా, ఖాజా, పాషా పాల్గొన్నారు.

సాధారణ ప్రసవాలతో ఆరోగ్యం సురక్షితం



గార్ల: సాధారణ ప్రసవాలతో మహిళల ఆరోగ్యం సురక్షితంగా ఉంటుందని ప్రభుత్వ వైద్యాధికారి రాజ్‌కుమార్ జాదవ్ సూచించారు. ఆదివారం స్థానిక సీహెచ్‌సీ ఆసుపత్రిలో గోపాలపురం గ్రామానికి చెందిన పప్పుల స్పందనకు సాధారణ ప్రసవం చేశారు. తల్లీబిడ్డా ఆరోగ్యంగా ఉన్నట్లు ఆయన వెల్లడించారు. కార్యక్రమంలో స్టాఫ్‌నర్సులు వినీల, స్పందన, పుష్పలత, హెచ్‌ఎస్ ఇస్మాయిల్‌బేగ్, ఏఎన్‌ఎం కవిత, సుజాత పాల్గొన్నారు.

కడుపునొప్పి భరించలేక ఆత్మహత్య

గూడూరు: కడుపునొప్పి భరించలేక ఇంట్లో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలోని ఊట్ల గ్రామంలో ఆదివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం భూక్య సక్రాం (55) భార్య బోడమ్మతో కల్సి తనకు ఉన్న వ్యవసాయ చేసుకుంటూ జీవనం గడుపుతున్నాడు. వారికి ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. వారికి వివాహాలు అయ్యాయి. కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతున్న సక్రాం మొక్కజొన్న, వరి పంటలకు యూరియా దొరకడంలేదు అనే బాధ ఉండగా, మరో వైపు కడుపునొప్పి బాధ కల్గుతుంది. ఇది భరించలేక శనివారం ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగాడు. వెంటనే గుర్తించిన కుటుంబ సభ్యులు మానుకోట ఏరియా ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందాడు. భార్య గోదమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

కేసు నమోదు

మహబూబాబాద్ రూరల్: ఓ పంచాయతీ విషయమై పెద్దమనిషిగా వచ్చిన వ్యక్తిపై దాడి చేసిన మరో ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేశామని మహబూబాబాద్ టౌన్ సీఐ గట్ల మహేందర్ రెడ్డి ఆదివారం తెలిపారు. పట్టణంలోని ఈద్గా బజార్ ప్రాంతంలో ఓ కుటుంబ కలహాల పంచాయతీ విషయంపై ధరావత్ కిశోర్ శనివారం అక్కడకు వచ్చాడు. ఈక్రమంలో పంచాయతీ నడుస్తుండగా ఆ కుటుంబ కలహాలకు సంబంధించిన అబ్బాయి తరఫున బంధువులు బాదావత్ శంకర్, వినోద్ పెద్దమనిషిగా వచ్చిన కిశోర్ పై ఆగ్రహం వ్యక్తం చేస్తూ దాడికి పాల్పడ్డారు. దీంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా శంకర్, వినోద్‌పై కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు.

విద్యుత్ ప్రమాదాలకు గురి కావొద్దు



కొత్తగూడ: అనుమతి లేకుండా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లి ప్రమాదాలకు గురి కావద్దని ఏఈ సురేష్ సూచించారు. మండలంలోని మైలారం గ్రామ రైతులకు అవగాహన కల్పించారు. ఏదైనా సమస్యలు తలెత్తినప్పుడు విద్యుత్ శాఖ సిబ్బందికి సమాచారం అందించాలని అన్నారు. విద్యుత్ సమస్యలు పరిష్కరించాలంటే 1912 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు.

దాతల తోడ్పాటు అభినందనీయం



దంతాలపల్లి: దాతల తోడ్పాటు అభినందనీయం అని దాట్ల మాజీ సర్పంచ్ కొమ్మినేని రవీందర్ అన్నారు. పాఠశాల స్థల దాత నూకల వృషసేన రెడ్డి ఆయన కూతురు మేరెడ్డి రజితరెడ్డి, అల్లుడు కేశవరెడ్డి తన తండ్రి జ్ఞాపకార్థం రూ.45లక్షలతో ఆడిటోరియం నిర్మాణానికి ఆదివారం శంకుస్థాపన చేశారు.

చవితికి సిద్ధమైన గణనాథులు

● 27నుంచి నవరాత్రి ఉత్సవాలు

బయ్యారం: ఈనెల 27న వినాయక చవితి సందర్భంగా వాడవాడలా కొలువుదీరనున్న గణనాథుల విగ్రహాలను బయ్యారంలో తయారీదారులు సిద్ధంగా ఉంచారు. మండలకేంద్రంలోని ఇల్లెందు–మహబూబాబాద్ రహదారి పక్కన రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన వారు 17 సంవత్సరాలుగా వినాయక విగ్రహాలను తయారు చేసి విక్రయించడం వృత్తిగా పెట్టుకున్నారు. ఈ ఏడాది 300 వినాయక విగ్రహాలను పలు సైజుల్లో తయారు చేసి రంగులను దిద్ది అమ్మకాలకు పెట్టారు. సైజులను బట్టి వెయ్యి రూపాయల నుంచి 20వేల వరకు విగ్రహాలు అందుబాటులో ఉన్నట్లు తయారీదారులు పేర్కొంటున్నారు.

పెరిగిన భక్తిభావం

కొన్ని సంవత్సరాల క్రితం పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో కొన్ని చోట్లే వినాయక విగ్రహాలను పెట్టి పూజించేవారు. రానురాను భక్తిభావం పెరగడంతో ఏటేటా వాడవాడలా వినాయక విగ్రహాలను ప్రతిష్ఠిస్తున్నారు. దీంతో విగ్రహాలతో పాటు పూజారులు, పూజా సామగ్రి, బ్యాండ్‌మేళాలకు డిమాండ్ పెరిగింది. ఎంత ఖర్చు అయినా వినాయక ఉత్సవాలను నిర్వహించడంలో తగ్గేదిలే అన్నట్టు యువత ముందుకు వస్తుండడంతో విగ్రహాల కొనుగోలుకు పోటీ ఏర్పడుతోంది.



అమ్మకానికి సిద్ధంగా ఉన్న వినాయక విగ్రహాలు

కుటుంబం మొత్తం తయారీపైనే..



రాజస్థాన్ రాష్ట్రం నుంచి వచ్చిన మేము కుటుంబంతో కలిసి వినాయకవిగ్రహాలను తయారు చేస్తాం. ప్రతి ఏటా చవితి ముగిసిన తరువాత మరలా వినాయక విగ్రహాలను తయారు చేయడం ప్రారంభిస్తాం. ఇలా ప్రతి ఏటా విగ్రహాలను చవితికి సిద్ధంగా ఉంచి అందుబాటు ధరలకు విక్రయాలు నిర్వహిస్తాం.

– షర్వేన్‌కుమార్, తయారీదారుడు

నిరుపయోగంగా కమ్యూనిటీ భవనం

డోర్నకల్: డోర్నకల్ మున్సిపాలిటీ పరిధిలోని బ్రిలియంట్ స్కూల్ రోడ్డులో ఏర్పాటు చేసిన ముస్లిం కమ్యూనిటీ భవనం పశువులకు నిలయంగా మారింది. భవనం నిర్మాణం కోసం రూ.50లక్షల టీయూఎఫ్ఐడీసీ నిధులతో అప్పటి ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ శంకుస్థాపన చేశారు. సుమారు 80శాతం పనులు పూర్తయిన తరువాత బిల్లులు అందకపోవడంతో కాంట్రాక్టర్ పనులను నిలిపివేశాడు. ఆడిటోరియం పనులు జరుగుతున్న సమయంలోనే ప్రహరీ నిర్మాణం కోసం రూ.11లక్షలు మంజూరు కావడంతో ప్రహరీ నిర్మాణం పూర్తి చేశారు. కమ్యూనిటీ భవన నిర్మాణం పూర్తయినా తలుపులు, కిటికీలు, విద్యుత్, తాగునీటి సౌకర్యం కల్పించకపోవడంతో భవనం నిరుపయోగంగా మారింది. దీంతో భవనాన్ని పశువులు, మేకలు, గొర్లకు అడ్డాగా మారింది. అధికారులు వెంటనే స్పందించి ముగింపు దశలో ఉన్న పనులను పూర్తి చేసి భవనాన్ని వినియోగంలోకి తేవాలని స్థానికులు కోరుతున్నారు.



కమ్యూనిటీ భవనంలో మేకలు, గొర్రెలు

యూరియా కొరతతో ఇబ్బందుల్లో రైతులు

● మాజీ మంత్రి దయాకర్ రావు

పెద్దవంగర: రాష్ట్రంలో రైతులు యూరియా కొరతతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో మండల అధ్యక్షుడు ఈదురు ఐలయ్య ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. అంతకు ముందు మండలంలోని అవుతాపురం గ్రామానికి చెందిన కాంగ్రెస్ మాజీ సర్పంచ్ సల్దెండి మంజుల సుధాకర్‌లతో పాటు 200 మంది కాంగ్రెస్ కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరారు. దయాకర్‌రావు వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఈసందర్భంగా దయాకర్‌రావు మాట్లాడారు. యూరియా కొరత రైతుల ఉత్పత్తి, ఆదాయంపై నేరుగా ప్రభావం చూపుతుందన్నారు. బీఆర్ఎస్ పాలనలో రైతులు సంక్షేమానికి రైతుభీమా, రైతుబంధు వంటి పథకాలను అమలు చేసిందన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలను దొంగ హామీలతో మోసం చేసిందని, రెండేళ్లలో 20ఏళ్ల అభివృద్ధిని వెనక్కి తీసుకెళ్లిందని గుర్తు చేశారు. కార్యక్రమంలో నాయకులు వెనుకదాసుల రామచంద్రయ్య శర్మ, కేతిరెడ్డి సోమనర్సింహ రెడ్డి, సంజయ్, సుధీర్, రాము, హరీశ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న దయాకర్‌రావు

సభను అడ్డుకోవడం రాజ్యాంగ విరుద్ధం

నెహ్రూసెంటర్: ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ హన్మకొండ జిల్లాలో నిర్వహించ తలపెట్టిన సభను జరగకుండా అడ్డుకోవడం రాజ్యాంగ విరుద్ధమని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా సహాయ కార్యదర్శి కొత్తపల్లి రవి ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివాసీ సంఘీభావ సభకు హాజరవుతున్న నేతలను అరెస్ట్ చేసి అదుపులోకి తీసుకోవడాన్ని ఖండిసున్నామన్నారు.

ప్రశంసపత్రం అందజేత

గార్ల: మండలంలోని గోపాలపురం గ్రామానికి చెందిన తెలగర్ల నారాయణ ఇటీవల మృతిచెందడంతో ఆయన నేత్రాలను ఖమ్మం ఐ బ్యాంకు డొనేట్ చేశారు. ఈమేరకు ఆదివారం ఐ బ్యాంకు సభ్యులు మంద నాగేశ్వరరావు గోపాలపురం గ్రామంలో మృతుడి ఇంటికి వెళ్లి వారి కుమారులకు ప్రశంసపత్రంతోపాటు జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో ఇమ్మడి గోవింద్, వెంకటరమణ, రావుల శ్రీనివాసరావు, దనియాకుల రామారావు, హనుమంతరావు పాల్గొన్నారు.

రైతు సమస్యల్లో రాజకీయాలు తగవు

పెద్దవంగర: రైతుల సమస్యలను పరిష్కరించడానికి రాజకీయాలు చేయడం తగదని సామాజిక వేత్త దొనికెన కుమారస్వామి హితవు పలికారు. ఆదివారం మండల కేంద్రంలో ఆయన విలేకరుతో మాట్లాడారు. రైతులకు సమయానికి ఎరువులు, విత్తనాలు, నీరు, గిట్టుబాటు ధరలు అందించాలన్నారు.

పేదల చేయూత కోసం రెడ్డి పరివార్

● ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి

తొర్రూరు రూరల్: గ్రామీణ ప్రాంతాల రెడ్డి నిరుపేదల కోసం రెడ్డి సంక్షేమ పరివార్ నిరంతరం పని చేయాలని ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని నాంచారీమడూరు గ్రామంలోని రెడ్డి గార్డెన్‌లో రెడ్డి సంక్షేమ పరివార్ 13వ వార్షికోత్సవ వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షురాలు హనుమాండ్ల ఝాన్సీరెడ్డిలు పాల్గొని నిరుపేద వితంతువు మహిళలకు ఉచితంగా కుట్టు మిషన్లు, నిరుపేద విద్యార్థులకు ఆర్థిక సహకారాన్ని అందించారు. కార్యక్రమంలో రెడ్డి సంక్షేమ పరివార్ నాయకులు ముద్దం విక్రంరెడ్డి, సత్యనారాయణరెడ్డి, రవీందర్‌రెడ్డి, దేవేందర్‌రెడ్డి, రఘునాథ్‌రెడ్డి, రాజేందర్ రెడ్డి నర్సింహరెడ్డి, సుధీర్‌రెడ్డి, ఉపేందర్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, అనిల్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.



నగదును అందిస్తున్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

ఐకమత్యంతోనే రాజ్యాధికారం



మాట్లాడుతున్న కమలాకర్‌గౌడ్

నెహ్రూసెంటర్: గౌడ కులస్తులు ఐకమత్యంగా ఉంటూ రాజ్యాధికారం సాధించే దిశగా అడుగులు వేయాలని గౌడ యువజన సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు గునిగంటి కమలాకర్‌గౌడ్ పిలుపునిచ్చారు. సంఘ సమావేశం బండి దీపక్‌గౌడ్ అధ్యక్షతన ఆదివారం జిల్లా కేంద్రంలో నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గౌడన్నలు పార్టీలకు అతీతంగా ఒక్కటై తమ సత్తా చాటుకోవాలన్నారు. ప్రభుత్వం జిల్లా కేంద్రంలో గౌడ కులస్తులకు 5ఎకరాల భూమి, కమ్యూనిటీ హాల్ నిర్మించాలని కోరారు. రానున్న స్థానిక ఎన్నికల్లో అత్యధికంగా గౌడలు ప్రజాప్రతినిధులుగా పోటీ చేసి గెలవాలన్నారు. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహ ఆవిష్కరణకు వేలాదిగా తరలివచ్చి విజయవంతం చేశారని, అదే ఉత్సాహంతో ఐక్యంగా ఉంటూ హక్కులను సాధించుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం గౌడ సంఘం నాయకులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సమావేశంలో జెఢ్పిపోతుల వెంకన్నగౌడ్, ముత్యం వెంకన్నగౌడ్, చిర్రయాకాంతంగౌడ్, బిక్కి వెంకటేశ్వర్లుగౌడ్, చిత్తనూరి శ్రీనివాస్‌గౌడ్, గండి వీరేందర్‌గౌడ్, వీరన్నగౌడ్, రాజేందర్‌గౌడ్, సాయిగౌడ్ పాల్గొన్నారు.

చెత్తతో నిండిన కాల్వలు

మహబూబాబాద్: మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో కాల్వలను పారిశుద్ధ్య కార్మికులు శుభ్రం చేయకపోవడంతో చెత్త పేరుకుపోతుంది. కాల్వల్లో మురుగు నీరు నిల్వ ఉండి దుర్వాసన వెదజల్లుతుంది. మానుకోట మున్సిపాలిటీ పరిధిలోని 23, 24, 25, 36 వార్డుల్లో దోమలు, పందుల సంఖ్య విపరీతంగా పెరిగాయి. 36 వార్డులో ఏ క్యాబిన్ రోడ్డులో ఉన్న కాల్వలను నెలల తరబడి శుభ్రం చేయకపోవడంతో దుర్వాసన వెదజల్లుతోంది. దీంతో జ్వరాల బారిన పడుతున్నామని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



36వ వార్డులో ఏ క్యాబిన్ రోడ్డులో కాల్వలో పడేసిన చెత్త

అధ్వానంగా రోడ్డు

కేసముద్రం: మున్సిపాలిటీ పరిధిలోని కేసముద్రం స్టేషన్ నుండి కేసముద్రంవిలేజ్ వరకు తారు రోడ్డుపై అడుగడుగునా గుంతలు పడడంతో వాహనాదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు గుంతల్లో నీళ్లు చేరడంతో రోడ్లన్ని చిత్తడిగా మారాయి. గుంతలమయంగా మారిన రోడ్డుకు మరమ్మతు చేయాలంటూ స్థానికులు కోరుతున్నారు.



రోడ్డుపై ఏర్పడిన గుంతలు

రాష్ట్రస్థాయి యోగా పోటీలకు ఎంపిక

మహబూబాబాద్ అర్బన్: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని యోగా అసోసియేషన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు, డీపీఎం ఆయుష్ వైద్యశాఖ జిల్లా అధికారి శ్రవణ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ బాలికల పాఠశాల ఆదివారం జిల్లాస్థాయి యోగా ఎంపికలు నిర్వహించారు. ఈసందర్భంగా శ్రవణ్ మాట్లాడుతూ.. రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులు సెప్టెంబర్ 5వ తేదీ నుంచి 7వ తేదీ వరకు నిర్మల్ జిల్లాలో జరుగు పోటీలకు హాజరవుతారన్నారు. 48మంది రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం కోటాయా నాయక్, యోగా అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు తోనం పుష్పలీల, కార్యదర్శులు పద్మావతి, నరేష్, జాయింట్ సెక్రటరీ రాజకుమారి, పీడీలు నిర్మల, భారతి, వసంత పావని, వీరభద్రం, రవి, తదితరులు పాల్గొన్నారు.



సర్టిఫికెట్లతో విద్యార్థులు

ప్రజాసమస్యల పరిష్కారానికే పోరుబాట



మాట్లాడుతున్న శ్రీమాన్

తొర్రూరు: ప్రజాసమస్యల పరిష్కారానికి బీజేపీ ఆధ్వర్యంలో పోరుబాట చేపడుతున్నట్లు పార్టీ నియోజకవర్గ కన్వీనర్ పూసాల శ్రీమాన్ తెలిపారు. డివిజన్ కేంద్రంలో ఆదివారం బీజేపీ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. అర్బన్ అధ్యక్షుడు పైండ్ల రాజేష్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో శ్రీమాన్ మాట్లాడారు. గ్రామాలు, మున్సిపాలిటీల్లో నెలకొన్న సమస్యలపై ఈనెల 25, 26 తేదీల్లో బీజేపీ ఆధ్వర్యంలో పోరుబాట పేరిట నియోజకవర్గ వ్యాప్తంగా పర్యటించనున్నామని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు పల్లె కుమార్, నాయకులు నడిగడ్డ సందీప్, సంతోష్, గట్ల భరత్, నూకల నవీన్, గంధం రాజు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

మహబూబాబాద్ రూరల్: జిల్లా కేంద్రంలోని 18వ వార్డులో ఎమ్మెల్యే మురళీనాయక్ ఆదేశాల మేరకు బాధిత కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను కాంగ్రెస్ నాయకులు ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు ఎడ్ల రమేష్, సింగం మనోహర్, నూకల బాలకృష్ణారెడ్డి, నూకల హరికృష్ణరెడ్డి పాల్గొన్నారు.

కోతుల పట్టివేతకు దాతలు ముందుకు..

చిన్నగూడూరు: మండల కేంద్రంలో కోతుల పట్టివేతకు దాతలు ముందుకు వస్తున్నారు. ఖమ్మంకు చెందిన గుమ్మడవెల్లి నాగుసేట్ రూ. 19 లు కోతుల పట్టివేతకు ఆదివారం గ్రామస్తులకు విరాళం అందజేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు మంచాల గౌరీశంకర్, కోల భద్రయ్య, పిల్లి శ్రీరాములు, దాసరి నరేందర్ ఉన్నారు.

యూరియా పంపిణీ

కేసముద్రం: మండలంలోని తాళ్లపూసపల్లి గ్రామంలో సొసైటీ వద్ద యూరియా బస్తాలను ఆదివారం పంపిణీ చేశారు. ఈమేరకు 90 బస్తాలకు గాను, అధిక సంఖ్యలో రైతులు క్యూలో బారులుదీరారు. ఈ క్రమంలో డీఆర్‌డీఓ మధుసూదన్‌రాజు సెంటర్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఏవో వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బోనాల పండుగ



గార్ల: గార్లలోని అంబేడ్కర్‌నగర్‌లో మహిళలు బోనాల పండుగను ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. డొలుత మేళతాళాల నడుమ మహిళలు బోనాలు ఎత్తుకొని గార్ల పురవీధుల్లో పూనకాలతో నృత్యాలు చేస్తూ ఊరేగింపు నిర్వహించి ముత్యాలమ్మ గుడికి చేరుకున్నారు. పంటలు సమృద్ధిగా పండాలని, పిల్లాపాపలు ఆయురారోగ్యాలతో ఉండాలని ముత్యాలమ్మ తల్లిని వేడుకున్నారు.

నివాళి

గార్ల: సురవరం సుధాకర్ రెడ్డి మరణం సీపీఐ పార్టీకి తీరని లోటని పార్టీ మండల సహాయ కార్యదర్శి రాగం రమేష్ అన్నారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నాయకులు జనార్దన్, భిక్షమయ్య, వెంకన్న పాల్గొన్నారు.

పరామర్శ..

ఖానాపురం : మండలంలోని మనుబోతులగడ్డకు చెందిన దున్నపోతుల వ్యాస్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా బాధిత కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ఆదివారం పరామర్శించారు. అనంతరం బండమీది మామిండితండాకు చెందిన బోడ తారమ్మ మృతి చెందగా ఆమె మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించి బాధిత కుటుంబాన్ని ఓదార్చారు. కార్యక్రమాల్లో మాజీ ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్‌రావు, బత్తిని శ్రీనివాస్ గౌడ్, వెంకటనర్సయ్య పాల్గొన్నారు.

పల్లెల అభివృద్ధే కాంగ్రెస్ ధ్యేయం

మరిపెడ రూరల్: గిరిజనతండాలు, పల్లెల అభివృద్ధి కాంగ్రెస్ పార్టీ ప్రధాన లక్ష్యమని కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గుగులోతు రవినాయక్ అన్నారు. డిప్యూటీ స్పీకర్ జాటోతు రాంచంద్రునాయక్ సహకారంతో మండలంలోని స్టేజితండా గ్రామంలో ఎంజీఎన్ఆర్ఈజీఎస్ నిధుల నుంచి మంజూరు అయిన రూ.8లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఆదివారం రవినాయక్ ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీతోనే అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. బడుగు, బలహీన వర్గాల కాంగ్రెస్ పార్టీ అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో అజయ్, కార్యదర్శి గుగులోతు రామోజీ, సాయిబాబా, జెట్టి సుదర్శన్ పాల్గొన్నారు.



సీసీ రోడ్డు ప్రారంభిస్తున్న రవినాయక్

ఘనంగా తీజ్ వేడుకలు

కురవి: మండలంలోని బంచరాయితండాలో తీజ్ పండుగ వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. తొమ్మిది రోజులపాటు గిరిజన యువతులు వేడుకలు నిర్వహించారు. ఊరేగింపుగా వెళ్లి తీజ్ బుట్టలను చెరువులో నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో గిరిజన యువతులు, మహిళలు పాల్గొన్నారు.

నర్సింహులపేట: మండల కేంద్రంలో ఆదివారం రాత్రి తీజ్ ఉత్సవాలను నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా డ్యాన్స్ పోటీలు నిర్వహించారు. అనంతరం గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు.



నర్సింహులపేట: వేడుకల్లో పాల్గొన్న గిరిజనులు

గణపతిగా తమలపాకు



పెద్దవంగర: మండలంలోని ఉప్పరగూడెం గ్రామానికి చెందిన బొమ్మెర సాత్విక వచ్చే వినాయక చవితిని పురస్కరించుకొని సంప్రదాయాన్ని కొత్త కోణంలో ఆవిష్కరిస్తూ, తమలపాకులను వినియోగించి వినాయకుడి ప్రతిమను సృజనాత్మకంగా రూపొందించింది. ఈ అద్భుత ప్రతిభ చూపరులను సైతం ఆకట్టుకుంది. సాత్వికను పలువురు అభినందించారు.

వ్యక్తిగత కక్షలతో దాడికి యత్నం ఇద్దరిపై కేసు నమోదు

మహబూబాబాద్ రూరల్: వ్యక్తిగత కక్షలతో ఒకరిని అడ్డగించి దాడిచేసేందుకు యత్నించిన ఘటనలో బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నామని మహబూబాబాద్ టౌన్ సీఐ గట్ల మహేందర్ రెడ్డి ఆదివారం తెలిపారు. కేసు వివరాలు ఇలా ఉన్నాయి.. మహబూబాబాద్ మండలంలోని గడ్డిగూడెం తండా గ్రామానికి చెందిన ధరావత్ సుమన్ అతడి బావమరిది ప్రభాకర్ కలిసి యూరియా బస్తాల కోసం ద్విచక్రవాహనంపై జిల్లా కేంద్రానికి ఈనెల 22వ తేదీ శుక్రవారం వచ్చారు. ఈక్రమంలో బయ్యారం మండలంలోని గంధంపల్లి గ్రామానికి చెందిన యూసుబ్, శేఖర్ అదే రోజు ఉదయం ప్రభాకర్‌కు ఫోన్ చేసి సుమన్‌తో మాట్లాడాలని చెప్పారు. సాయంత్రం వరకు ఆ ఇద్దరు వ్యక్తులు స్పందించకపోవడంతో మళ్లీ వాళ్లకి ఫోన్ చేయగా సుమన్ ప్రభాకర్ ఇద్దరు కలిసి నర్సంపేట బైపాస్ రోడ్డులోగల గుమ్మడూరు ప్రాంతానికి వెళ్లారు. అక్కడ ప్రభాకర్‌ను రాత్రి సమయంలో కొంత దూరంలో నిలబెట్టి యూసుబ్, శేఖర్ ఇద్దరు కలిసి సుమన్‌ను కారుతో అడ్డగించి దాడిచేసేందుకు వెళ్తుండగా గమనించిన ప్రభాకర్ అదే సమయంలో సుమన్‌కు ఫోన్ చేసి విషయాన్ని తెలియజేశాడు. వెంటనే బాధితుడు సుమన్ అక్కడ నుంచి తప్పించుకుని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. యూసుబ్, శేఖర్ పై కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు.

కారులో కత్తి.. సోషల్ మీడియాలో వైరల్

జిల్లా కేంద్రంలో నమోదైన కేసు వెనుకాల ప్రియురాలి విషయంలో ఘర్షణ జరిగినట్లుగా అనుమానం వ్యక్తమవుతుంది. తాజా ప్రియుడితో మాజీ ప్రియురాలు స్నేహంగా ఉండడాన్ని తట్టుకోలేక మాజీ ప్రియుడు కొందరు వ్యక్తులతో కలిసి కారులో వచ్చి తాజా ప్రియుడిపై కత్తితో దాడికి యత్నించినట్లు సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతుంది. ఘర్షణను స్థానికులు అడ్డుకుని తాజా ప్రియుడిని రక్షించి, కారులో ఉన్న వారిపై తిరగబడినట్లు సమాచారం. దీంతో కారులో వచ్చిన కొందరు వ్యక్తులు అక్కడి నుంచి పారిపోగా ఒక్కరు స్థానికులకు చిక్కారు. చిక్కిన అతడిని నిలదీసి కారులో ఉన్న కత్తిని సెల్ ఫోన్ లో చిత్రీకరించగా ఆ దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారి జిల్లాలో కలకలం సృష్టించాయి.

జోరుగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు

డోర్నకల్: గ్రామాల్లో లబ్ధిదారులు వేగంగా జరుగుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలతో సందడి నెలకొందని కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు బత్తుల శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు. మండలంలోని జోగ్యాతండా, బొడ్రాయితండాల్లో ఆదివారం ఇందిరమ్మ పల్లె ప్రగతి యాత్రలో భాగంగా ర్యాలీ నిర్వహించి, పలు ప్రాంతాల్లో మొక్కలు నాటారు. ఈసందర్భంగా శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడుతూ.. గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు డీఎస్ జగదీష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కాసం శేఖర్, నాయకులు రమేష్, ఆంగోత్ వెంకన్న, తాళ్లూరి హనుమంతరావు పాల్గొన్నారు.



ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న నాయకులు